# ఈనాడు
## తూర్పుగోదావరి

బుధవారం 20 జూన్ 2018 .. 16 పేజీలు


# ఇక సాంకేతిక పాలన

**✦ కాకినాడ జేఎన్‌టీయూలో ఆటోమేషన్ విధానం అమలుకు చర్యలు**

**✦ విద్యార్థులతోనే సాఫ్ట్‌వేర్ తయారీ ✦ డిసెంబరు నాటికి అందుబాటులోకి..**




**కాకినాడ, ఈనాడు :** సాంకేతిక విద్యాబోధనలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న కాకినాడ జేఎన్‌టీయూ పాలనలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. 262 అనుబంధ కళాశాలలు, 2.30 లక్షల మంది విద్యార్థులు ఉన్న విశ్వవిద్యాలయంలో నిత్యం బోధన, బోధనేతర అవసరాల కోసం పరిపాలనా పరంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని అవకతవకలు జరుగుతున్నాయి. దీంతో విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మౌలిక వసతులు, బోధనా పరంగా ఇబ్బందులతో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లోనూ వెనుకంజలోనే ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు వర్సిటీలో ఆటోమేషన్ విధానాన్ని ఆచరణలోకి తెస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వీవీ సుబ్బారావు **...మిగతా 7లో**


## ఇక సాంకేతిక పాలన


**(మొదటి పేజీ తరువాయి)** తెలిపారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఇక నుంచి పరిపాలనాపరమైన ప్రతి అంశాన్ని ఆన్‌లైన్ విధానంలోకి తెస్తామని చెప్పారు. ఆటోమేషన్ ద్వారా పారదర్శకమైన పనితీరుతో పాటు సకాలంలో సేవలు అందించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆటోమేషన్ కోసం రూ. కోట్లు వెచ్చించకుండా నూతన విధానాన్ని పాటించాలని నిర్ణయించారు. తమ అవసరాల కోసం విశ్వవిద్యాలయంలో చదువుతున్న యూజీ, పీజీ విద్యార్థుల ద్వారానే కొత్త సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయిస్తున్నారు. విశ్వవిద్యాలయం ఆచార్యుల సహకారంతో విద్యార్థులు ఇందులో భాగస్వాములు అవుతున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఇప్పటికే ఇది ఒక కొలిక్కి వచ్చిందని, త్వరలోనే పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి దీనిని ఆచరణలోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.